క్లుప్తంగా

అమెరికాలో బతుకమ్మ సంబరాలు



పాల్గొన్న తెలుగు యువతులు

వేములవాడ: అమెరికాలోని నార్త్ కరోలినా సౌత్ పార్క్‌లో తెలుగింటి ఆడపడుచులు రంగు రంగుల పువ్వులతో బతుకమ్మను సిద్ధం చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో నవీన్‌రెడ్డి, నిశాంత్, శ్రీకాంత్, అభిలాష్, శివ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక



సాహితీ, శ్రీహర్ష



అల్లె మనోజ్



ముత్యాల మనోజ్

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లబొప్పాపూర్ హైస్కూల్‌కు చెందిన నలుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక య్యారు. ఇల్లంతకుంటలో మంగళవారం నిర్వహించిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి అండర్–17 పోటీల్లో బాలబాలికల విభాగంలో వాలీబాల్‌లో చల్ల సాహితీ, ముత్యాల శ్రీహర్ష, ముత్యాల మనోజ్, అల్లె మనోజ్ రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని పీఈటీ ప్రభాకర్ తెలిపారు. ఈ నలుగురు విద్యార్థులు ఈనెల 19 నుంచి 22 వరకు మహబూబ్‌నగర్ జిల్లాలో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారని ఆయన అన్నారు.

ఇండియన్ టీంకు ఎంపికైన అనిల్‌కు సత్కారం



అనిల్‌ను సత్కరిస్తున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

వేములవాడరూరల్: సెప్టోబాల్ ఇండియా టీంకు ఎంపికైన మండలంలోని చెక్కపల్లి గ్రామానికి చెందిన ఎడపల్లి అనిల్‌ను రాష్ట్ర బీఎస్పీ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సత్కరించారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో వచ్చే నెల శ్రీలంక, థాయిలాండ్ లలో జరిగే అంతర్జాతీయ క్రీడల్లో పాల్గొననున్నారు. ఈ కార్యక్రమంలో సెప్టోబాల్ ఫెడరేషన్ సెక్రెటరీ ఓదెలుయాదవ్, బీఎస్పీ మహిళా దక్షిణ తెలంగాణ కన్వీనర్ పుట్టల శైలజ, సర్పంచ్ జైపాల్‌రెడ్డి, ఎడపల్లి హరీశ్, గుడిసె కార్తీక్ పాల్గొన్నారు.

అభ్యుదయ కవి జమార



జమార సంతాప సభలో పాల్గొన్న కవులు

బోయినపల్లి: జమార కలం పేరుతో కవితలు, గేయాలు రచించి ప్రజలను చైతన్యవంతులను చేయడంతో కవి నమిలికొండ జగన్మాధవరావు చేసిన సేవలు మరువలేనివని వక్తలు అన్నారు. మంగళవారం నిర్వహించిన ఆయన సంతాపసభలో జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యవర్గసభ్యులు సీ.రామరాజు, జిల్లా సాంస్కృతిక కళా సంస్థల వ్యవస్థాపక అధ్యక్షుడు యెల్లె పోశెట్టి మాట్లాడారు. విద్యుత్ శాఖలో ఉద్యోగిగా పని చేస్తూనే తన కవితలను జమార ప్రజల్లోకి తీసుకెళ్లాడన్నారు. కార్యక్రమంలో బొడ్డు రాములు, వరాల దేవయ్య, కళాకారుల సంఘం మండల అధ్యక్షుడు మొగులోజు లక్ష్మీరాజం తదితరులు పాల్గొన్నారు.



బతుకమ్మ ఆడుతున్న మహిళలు



ధర్మగుండంలో నిమజ్జనం చేస్తున్న మహిళలు

రాజన్న సన్నిధిలో బతుకమ్మ సంబరాలు

వేములవాడ: బతుకమ్మ సంబరాలు మంగళవారం రాజన్న ఆలయం వద్ద జోరుగా సాగాయి. పట్టణంలోని మహిళలు రాజన్న ఆలయ ఆవరణకు చేరుకుని బతుకమ్మ ఆట, కోలాటాలు ఆడారు.

రసాభాసగా ప్రజాభిప్రాయ సేకరణ

- గౌరవెల్లి ప్రాజెక్టు సామర్థ్యం పెంచడంపై అభ్యంతరాలు
- మిడ్ మానేరు నిర్వాసితులకు పరిహారంపై ఆందోళన
- నాయకుల మధ్య వాగ్వాదం



వేదిక వద్ద నాయకుల వాగ్వాదం

బోయినపల్లి: రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో బోయినపల్లి మండలం కొదురుపాక రైతువేదిక భవనంలో మంగళవారం చేపట్టిన ప్రజాభిప్రాయ సేకరణ రసాభాసగా ముగిసింది. ఎస్సారెస్పీ నుంచి గౌరవెల్లి ప్రాజెక్టు వరకు మిడ్‌మానేరు ప్రాజెక్టు విస్తరించి ఉన్నందున ప్రాజెక్టుతో పర్యావరణ పరంగా ఇబ్బందులు అంశంపై చర్చించారు. అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి రామగుండం నుంచి డీఈ నరేందర్ హాజరయ్యారు. ఈసందర్భంగా పర్యావరణ పరిరక్షణ, శిక్షణ, పరిశోధన సంస్థ (ఈపీటీఆర్ఐ) కో ఆర్డినేటర్ రామకృష్ణ మాట్లాడుతూ, గౌరవెల్లి ప్రాజెక్టు సామర్థ్యం మొదట 1.410 టీఎంసీలు ఉండేదని, దాన్ని 8.23 టీఎంసీలకు విస్తరించినట్లు తెలిపారు. ప్రతీ నాలుగేళ్లకోసారి అదనపు వరద వస్తుందని ఎస్సారెస్పీలో పూడిక పెరగడంతో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిందని పైనుంచి వచ్చే అదనపు వరదను ఒడిసి పట్టడానికి గౌరవెల్లి ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం పెంచినట్లు పేర్కొన్నారు.

ప్రజాప్రతినిధుల అభ్యంతరం

సభలో కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కూస రవీందర్ మాట్లాడారు. రంగనాయకసాగర్ ప్రాజెక్టు పరిధిలో విలువైన భూములు ఉండడంతో దాని సామర్థ్యం పెంచలేదని, అదే గౌరవెల్లి పెంచారని రెండింటి ఆయకట్టు మాత్రం ఒకటేనన్నారు. మిడ్ మానేరు నిర్వాసితుల ఇళ్ల నిర్మాణాలకు రూ. 5.04 లక్షలు ఇస్తామన్న హామీ నెరవేరలేదని ఆరోపించారు. దీంతో అక్కడే ఉన్న బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య, వైస్ ఎంపీపీ నాగయ్య, ఆర్బీఎస్ అధ్యక్షుడు లచ్చిరెడ్డి తదితరులు ఇది ప్రజాభిప్రాయ సేకరణా? పార్టీ మీటింగా అని అభ్యంతరం వ్యక్తం చేశారు. మిడ్‌మానేరు బ్యాక్ వాటర్‌తో పంటలు మునుగుతున్నాయని మాన్వాడ వాసులు, దేశాయినపల్లి అదనపు టీఎంసీ కాల్వ పనులతో విలాసాగర్ చెరువు బ్యాక్ వాటర్ చేరి పంటలు మునుగుతున్నాయని నిమ్మ శ్రీనివాసరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాభిప్రాయాలు అన్ని రికార్డు చేశామని పై అధికారులకు తెలియజేస్తామని మిడ్‌మానేరు ఈఈ జగన్ తెలిపారు. వేములవాడ ఆర్డీఓ మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పని చేయాలి

- ఏఐసీసీ సెక్రటరీ క్రిస్టోఫర్ తిలక్



మాట్లాడుతున్న ఏఐసీసీ సెక్రటరీ క్రిస్టోఫర్ తిలక్

కోనరావుపేట: పథకాల పేరిట మోసం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రజలు బుద్ధి చెప్పాలని ఏఐసీసీ కార్యదర్శి క్రిస్టఫర్ తిలక్ కోరారు. కోనరావుపేటలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో కాంగ్రెస్ అభ్యర్థి ఆది శ్రీనివాస్‌తో కలిసి మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో 80 నుంచి 90 స్థానాలను కాంగ్రెస్ గెలుచుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. తమ అధినేత్రి సోనియాగాంధీ ఇచ్చిన తెలంగాణను సీఎం కేసీఆర్ అభివృద్ధిలో పదేళ్ల వెనక్కి తీసుకెళ్లారని మండిపడ్డారు. ఒక్క మద్యం అమ్మకాల్లో మాత్రం దేశంలోనే వృద్ధి సాధించారని ఎద్దేవా చేశారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ హయాంలోనే ప్రాజెక్టులు ప్రారంభమయ్యాయన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీకి మత పిచ్చి తప్ప, అభివృద్ధిపై ఆలోచనే లేదని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమైంది

రుద్రంగి: రాష్ట్రంలో కాంగ్రెస్‌కు అనుకూల పవనాలు వీస్తున్నాయని, అధికారంలోకి రావడం ఖాయమని ఏఐసీసీ సెక్రటరీ క్రిస్టోఫర్ తిలక్ అన్నారు. రుద్రంగిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఎన్నికల్లో అనుసరించాల్సిన విధి విధానాలపై కాంగ్రెస్ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. తెలంగాణను అప్పుల తెలంగాణగా మార్చి, విచ్చలవిడిగా మద్యం షాపులు తెరిచి నిరుద్యోగ యువతను, రాష్ట్ర ప్రజానీకాన్ని మత్తుకు బానిసలుగా చేశారని విమర్శించారు. రాష్ట్ర ప్రజలకు డబుల్ బెడ్రూం ఇళ్లకు స్థలాలు దొరకడం లేదు కానీ ఎమ్మెల్యేలు, మంత్రులకు పదుల సంఖ్యలో ఫాంహౌజులకు వందల ఎకరాలు ఎలా దొరుకుతున్నాయని ప్రశ్నించారు. వేములవాడ కాంగ్రెస్ అభ్యర్థి, డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ఎమ్మెల్యేగా ఒక్కసారి గెలిపిస్తే నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే అమలు చేసే ఆరు డిక్లరేషన్‌లను కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఓటర్లకు అర్థమయ్యే విధంగా గడప గడపకు వెళ్లి వివరించాలని సూచించారు. కాంగ్రెస్ మండల శాఖ అధ్యక్షులు షేక్ ఫిరోజ్ పాషా, తూము జలపతి, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు కేతిరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, రుద్రంగి సర్పంచ్ తర్రె ప్రభలత, డీసీసీ కార్యదర్శులు తిరుపతి, శ్రీనివాస్ రెడ్డి, తర్రె లింగం, గ్రామ శాఖ అధ్యక్షుడు సామ మోహన్‌రెడ్డి, నాయకులు తర్రె మనోహర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

రెచ్చగొట్టే ప్రసంగాలు చేయొద్దు


- జిల్లా డిప్యూటీ ఎన్నికల అధికారి ఖీమ్యానాయక్



మాట్లాడుతున్న ఎన్నికల అధికారి ఖీమ్యానాయక్

సిరిసిల్ల: ఎన్నికల్లో కుల, మతాలను రెచ్చగొట్టే ప్రసంగాలు చేయొద్దని జిల్లా డిప్యూటీ ఎన్నికల అధికారి ఎన్.ఖీమ్యానాయక్ అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అన్ని పార్టీల నాయకులు పాటించాలన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేయొద్దని, మద్యం, నగదు, కానుకలను ఇవ్వడం నేరమన్నారు. ప్రచార సభలకు, ర్యాలీలకు అనుమతి తీసుకోవాలన్నారు. ఎన్నికల ఖర్చుల వివరాలను ఎప్పటికప్పుడు అందించాలని సూచించారు. ఎన్నికల ప్రకటనలకు ఎంసీఎంసీ అనుమతి తీసుకోవాలన్నారు. సమావేశంలో సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు ఎస్.ఆనంద్‌కుమార్, పి.మధుసూదన్, జిల్లా ఆడిట్ ఆఫీసర్ బి.స్వప్న, డిప్యూటీ రిజిస్ట్రార్ టి.రామకృష్ణ, డీపీఆర్వో ఎం.దశరథం, అఖిల పక్ష నేతలు లింగంపల్లి మధుకర్, కె.మల్లారెడ్డి, ఎస్.నాగరాజు, కొండ రమణ, టి.కల్యాణచక్రవర్తి, ఎండీ ముస్తాఫా, బి.యాదగిరి, తీగల శేఖర్ గౌడ్, పి.కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల క్షేత్ర పర్యటన



పల్లె దవాఖానాను సందర్శించిన ఏఎస్‌వోలు

గంభీరావుపేట: క్షేత్రస్థాయి శిక్షణ కోసం సెంట్రల్ సెక్రటేరియట్ సర్వీస్‌కు సంబంధించిన అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్(ఏఎస్‌వో)లు ఫౌండేషన్ శిక్షణలో భాగంగా మంగళవారం మండలంలోని నర్మాలలో పర్యటించారు. గ్రామంలో అమలవుతున్న ప్రభుత్వ పథకాల గురించి తెలుసుకున్నారు. పల్లె దవాఖానా, రైతు వేదికలను సందర్శించి వాటి పనితీరు తెలుసుకున్నారు. ఎంపీడీవో శ్రీనివాస్ వారిని సమన్వయ పరిచారు. కార్యక్రమంలో ఏఎస్‌వోలు జతిన్‌కుమార్‌యాదవ్, తపమే మండల్, అంబుజ్ తోమర్, జై ప్రకాశ్‌కుమావత్, రాహుల్ పాల్గొన్నారు. వారి వెంట సర్పంచ్ ఎడబోయిన రాజు, ఎంపీవో రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ డబుల్‌బెడ్రూం ఇళ్లు ఇవ్వాలి



మాట్లాడుతున్న రాములు

సిరిసిల్లటౌన్: అర్హులైన నిరుపేదలందరికీ ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇళ్లు వెంటనే నిర్మించి ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు డిమాండ్ చేశారు. మంగళవారం కార్మిక భవనంలో మాట్లాడారు. డబుల్ బెడ్రూం ఇళ్లు రాని పేదలకు స్థలంతో పాటు రూ.3 లక్షలు ఇస్తామని చెప్పడంపై వ్యతిరేకత వ్యక్తం చేశారు. నాయకులు అజ్జ వేణు తదితరులు ఉన్నారు.

గడప గడపకూ కాంగ్రెస్



ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట, రాగట్లపల్లి, దుమాల గ్రామాల్లో మంగళవారం గడపగడపకు గ్యారంటీ కార్డులను జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌కే గౌస్, జిల్లా కార్యదర్శి పందిర్ల లింగంగౌడ్ పంపిణీ చేశారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, మండలాధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

ముస్తాబాద్: ముస్తాబాద్‌లో గడపగడపకు కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాన్ని పార్టీ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి మంగళవారం నిర్వహించారు. ఎంపీటీసీ గుండెల్లి శ్రీనివాస్, డీసీసీ ఉపాధ్యక్షుడు బుర్ర రాములు, పట్టణాధ్యక్షుడు రాజు పాల్గొన్నారు.

సోషల్ మీడియాలో పోస్టింగ్‌పై ఫిర్యాదు

వేములవాడ: వేములవాడకు చెందిన సోమినేని మల్లేశం సోషల్ మీడియాలో తమ పరువుభంగం కలిగే విధంగా పోస్టింగ్‌లు చేశారని ఆరోపిస్తూ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చంద్రగిరి శ్రీనివాస్‌గౌడ్ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రాజన్నకు సెలవుల రద్దీ



వేములవాడ: ఎములాడ రాజన్నకు దసరా సెలవుల రద్దీ కొనసాగుతూనే ఉంది. మంగళవారం సైతం స్వామివారిని దర్శించుకున్న భక్తులు బద్దిపోచమ్మకు బోనం మొక్కులు చెల్లించుకున్నారు.

పైసలు పంచిన కౌన్సిలర్



సిరిసిల్లటౌన్: సీఎం కేసీఆర్ సభ తర్వాత సిరిసిల్లలో కౌన్సిలర్ పైసలు పంచడం చర్చనీయాంశమైంది. సాయంత్రం 6 గంటల తర్వాత 16వ వార్డుకు చెందిన కౌన్సిలర్ గుడ్ల శ్రీనివాస్ పోచమ్మ వీధిలో మహిళలకు ఒక్కొక్కరికి రూ. 200 చొప్పున పంపకాలు సాగించారు. అతను డబ్బులు ఇస్తుంటే, మరో సహాయకుడు పేర్లు రాసుకోవడం వంటి విషయాలు వీడియోల్లో వైరల్ అయ్యాయి.

జై భవానీ



బండపల్లిలో దుర్గామాత సన్నిధిలో జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ



గంభీరావుపేటలో దర్శించుకున్న కేకే మహేందర్‌రెడ్డి



బోయినపల్లి: అమ్మవారి పూజలో భక్తులు

చందుర్తి/గంభీరావుపేట/బోయినపల్లి: జిల్లాలో దుర్గా నవరాత్రి ఉత్సవాలు సామూహిక కుంకుమపూజలు, చండీహోమాలతో అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. చందుర్తి మండలం బవదపల్లిలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపంలో జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ, గంభీరావుపేటలో సిరిసిల్ల కాంగ్రెస్ అభ్యర్థి కేకే మహేందర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య ప్రత్యేక పూజలు చేశారు.

ప్రజలు కాంగ్రెస్ వైపే ఉన్నారు

- సిరిసిల్ల కాంగ్రెస్ అభ్యర్థి కేకే మహేందర్‌రెడ్డి



చంద్రంపేటలో పర్యటిస్తున్న కేకే మహేందర్‌రెడ్డి

సిరిసిల్లటౌన్/సిరిసిల్లఅర్బన్: ఈ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ వైపే నిలబడుతున్నారని ఆ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం సిరిసిల్లలోని పలు వార్డుల్లో ఆయన కాంగ్రెస్ అమలు చేస్తామన్న ఆరు గ్యారెంటీ పథకాలపై విస్తృత ప్రచారం చేపట్టారు. సిరిసిల్ల మున్సిపల్‌లో ఏడు గ్రామాలను విలీనం చేసి ప్రజలకు ఉపాధి లేకుండా చేశారన్నారు. పన్నులు పెరిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే గ్రామ పంచాయతీలుగా కొనసాగించే బాధ్యత తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, పట్టణాధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, మాజీ కౌన్సిలర్ యెల్ల లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులతో పోరాటం ఆగదు



పోలీసుల అదుపులో నీరటి శ్రీనివాస్

చందుర్తి/కోనరావుపేట: అర్ధరాత్రి వేళ అక్రమ అరెస్టులతో సుంకరి ఇస్పాదార్ల పోరాటం ఆగదని సుంకరి ఇస్పాదార్ల రాష్ట్ర అధ్యక్షుడు నీరటి శ్రీనివాస్ అన్నారు. చందుర్తి మండలం మూడపల్లిలో తన ఇంట్లో తనను, కోనరావుపేటలో జిల్లా అధ్యక్షుడు పర్శ రాములుతో పాటు మండల శాఖ వీరవేణి తిరుపతి, ఎర్ర రమేశ్ సోమవారం అర్ధరాత్రి అరెస్టు చేసి ఠాణాకు తరలించారని ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. సభలో తమ సమస్యలపై ఎక్కడ నిలదీస్తామోనని భయపడి ముందస్తుగా ఎక్కడికక్కడే నిలువరించేందుకు అరెస్టు చేశారని అన్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ఓడించేందుకు గ్రామగ్రామ తిరుగుతూ ప్రచారం చేస్తామన్నారు. పోలీసుల అరెస్టులతో భయపడి పోరాటాన్ని ఆపే ప్రసక్తే లేదన్నారు.

బీజేపీ, కాంగ్రెస్ నాయకుల ముందస్తు అరెస్టులు

ఎల్లారెడ్డిపేట: జిల్లా కేంద్రంలో ప్రజా ఆశీర్వాద సభ మంగళవారం నిర్వహిస్తుండగా పోలీసులు ప్రతిపక్ష నాయకులను ముందస్తుగా అరెస్టు చేశారు. సోమవారం అర్ధరాత్రి నుంచే నాయకుల ఇళ్లపై పోలీసులు దాడులు చేసి వారిని అదుపులోకి తీసుకున్నారు. ఎల్లారెడ్డిపేటలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి నేవూరి దేవేందర్‌రెడ్డి, బీజేపీ మండలాధ్యక్షుడు పొన్నాల తిరుపతిరెడ్డి, ఏబీవీపీ హాస్టల్స్ రాష్ట్ర కన్వీనర్ మారవేని రంజిత్‌కుమార్‌ను అరెస్టు చేశారు.

వేములవాడరూరల్: వేములవాడ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బీజేపీ మండల అధ్యక్షుడు జక్కుల తిరుపతి, మండల ప్రధాన కార్యదర్శి చెట్టిపల్లి రవికిశోర్‌ను అరెస్టు చేశారు.

బోయినపల్లి: బీజేవైఎం మండల అధ్యక్షుడు కొనుకటి హరీశ్‌ను స్థానిక పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

కాంగ్రెస్ నాయకులు అరెస్టు

రుద్రంగి: రుద్రంగిలో డీసీసీ కార్యదర్శి చెలుకల తిరుపతి, గ్రామ శాఖ అధ్యక్షుడు సామ మోహన్‌రెడ్డి, స్థానిక నాయకుడు మహిపాల్‌ను పోలీసులు ముందస్తు అరెస్టు చేసి స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పాలనలో విఫలం కావడంతోనే విపక్షాలు ప్రశ్నిస్తే సమాధానాలు ఇవ్వలేక అక్రమ అరెస్టులు చేయిస్తున్నారని ఆరోపించారు. ప్రశ్నించే గొంతులను నియంతృత్వ ధోరణితో అణగదొక్కుతున్నారని అన్నారు.

సేట్లకు కోట్లు.. కార్మికులకు పాట్లు




మాట్లాడుతున్న రమేశ్

సిరిసిల్లటౌన్: బతుకమ్మ చీరలకు సంబంధించి రూ.70కోట్లు యజమానులకు ఇచ్చిన సర్కారు యారన్ సబ్సిడీ రూ.9కోట్లు కార్మికులకు ఎందుకివ్వలేదని పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూశం రమేశ్ ప్రశ్నించారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. మంత్రి కేటీఆర్ మొదట్నుంచి యజమానులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. వర్కర్ టూ ఓనర్ పథకం ఎందుకు అమలు చేయడం లేదని అన్నారు. ఇప్పటికైనా కార్మికులకు పండుగ లోపు సబ్సిడీ డబ్బు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కోడం రమణ, నక్క దేవదాసు, గుండు రమేశ్, సబ్బని చంద్రకాంత్, మోర తిరుపతి, గడ్డం రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

గుండెపోటుతో మాజీ ఉపసర్పంచ్ మృతి



ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మాజీ ఉపసర్పంచ్ ఆడెపు భగవాన్(72) మంగళవారం తెల్లవారుజామున అకస్మాత్తుగా గుండెపోటుతో మృతిచెందాడు. రెండు పర్యాయాలు ఉపసర్పంచ్‌గా పనిచేసిన భగవాన్ కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, స్థానిక సర్పంచ్ నేవూరి వెంకట్‌రెడ్డి, ఏఎంసీ వైస్‌చైర్మన్ బందారపు బాల్‌రెడ్డి పరామర్శించారు.

అగ్ర కులాలను ఢీకొట్టేందుకు ఎన్నికల బరిలో..

సిరిసిల్లఅర్బన్: అగ్ర కుల రాజకీయాలను ఢీకొట్టేందుకే రానున్న ఎన్నికల్లో ధర్మసమాజ్ పార్టీ అణగారిన కులాల అభ్యర్థులతో బరిలో దిగుతుందని సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గ అభ్యర్థులు కేసుగాని పరమేశ్వరి, గడ్డం హరీశ్‌గౌడ్ అన్నారు. సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం మాట్లాడారు. జిల్లాలోని ప్రజలందరూ ఓటుని అమ్ముకోకుండా ఆలోచించి ఓటు వేయాలని కోరారు.

బీజేవైఎం మండల అధ్యక్షుడు సస్పెన్షన్

వీర్నపల్లి: పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న బీజేవైఎం మండల అధ్యక్షుడు తౌటు అజయ్‌ని పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు బీజేపీ అధ్యక్షుడు గునుకుల దేవేందర్‌రెడ్డి తెలిపారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు ఎవరు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.